సాక్షి మంచిర్యాల

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



ఆఖరి రోజు అట్టహాసంగా..
ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. ఆఖరి రోజు సోమవారం అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. భారీ ర్యాలీగా వచ్చి ర్యాలీ నామినేషన్ వేశారు. 8లో▸



ముగిసిన జాతర
కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామంలో ముత్యాలమ్మ జాతర సోమవారం ముగిసింది. మంచిర్యాల జిల్లాతోపాటు గోదావరిఖని, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.0 /19.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఉత్తరం దిశగా వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గూడెంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 6న ప్రారంభమైన కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నిత్యవిధి ప్రాభోధికి ఆరగింపు, హవనము, స్థాలీపాక, పంచసూక్త హోమము, బలిహరణము వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సప్తాహ భజన కార్యక్రమాలు కొనసాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుణ్ని దర్శించుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి.

సైబర్ వారియర్‌తో నేరాలకు చెక్



సూచనలు ఇస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు సైబర్ వారియర్స్ టీమ్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం సైబర్ వారియర్స్‌కు సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బాధితుల నుంచి 1930కు ఫోన్‌కాల్ వచ్చినపుడు ఎలా స్వీకరించాలి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌బీ)లో నేరాన్ని నివేదించడం, అనుమానిత వ్యక్తులను గుర్తించడం, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై దర్యాప్తు చేయడం వంటి వాటిపై శిక్షణతోపాటు అవగాహన కల్పించారు. సైబర్ వారియర్స్‌కి ప్రత్యేకంగా ఒక సెల్‌ఫోన్, సిమ్‌కార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘువేంద్రరావు, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్, సిబ్బంది సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన ప్రారంభం



మార్కులు పరిశీలిస్తున్న ఎంఈవో మాళవీదేవి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు జిల్లాలో ఈ నెల 13వరకు 246 పాఠశాలల్లో 41తనిఖీ బృందాల పరిశీలన సాగనుంది. జిల్లా కేంద్రంలోని తవక్కల్ పాఠశాలలో తనిఖీ బృందంతోపాటు మంచిర్యాల ఎంఈవో మాళవీదేవి ప్రాజెక్టు వర్క్స్, నోట్‌బుక్‌లో చేతిరాత, ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లో వచ్చిన మార్కులు తదితర అంశాలను పరిశీలించారు.

జాప్యం లేకుండా కొత్త విద్యుత్ కనెక్షన్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. స్థానిక జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణంతో దరఖాస్తులు తిరస్కరించకుండా వినియోగదారులు స్పందించడానికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారుడు తన దరఖాస్తు పరిశీలన మంజూరు ఎక్కడి వరకు వచ్చిందనే విషయాలు టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం 1912 నంబరు ఫోన్ చేసి నివృత్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

లక్ష్యం.. శతశాతం..!



పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

- ఫలితాల మెరుగుకు 'పది'ంతల పరీక్షలు
- జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ
- ప్రీ ఫైనల్‌కు ముందు గ్రాండ్ టెస్ట్ నిర్వహణ
- జిల్లాలో 17నుంచి 24వరకు షెడ్యూల్ ఖరారు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. వార్షిక పరీక్షల్లో గతం కంటే మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. శత శాతం ఫలితాలే లక్ష్యంగా నిర్దేశించారు. పాఠ్యపుస్తకాలతోపాటు అభ్యసన దీపికలు అందజేశారు. నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ సాగుతోంది. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఫిబ్రవరి 1నుంచి మార్చి 20వరకు పాఠశాలలు నడిచే 38రోజులపాటు అల్పాహారం అందిస్తున్నారు. రోజువారీగా స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల క్రితం కలెక్టర్ కుమార్ దీపక్ బీసీ సమీకృత వసతిగృహంలో రాత్రి బస చేసి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై మార్గదర్శనం చేశారు. జనవరి 31లోపు ఎఫ్ఏ-4 పరీక్షలు పూర్తయ్యాయి. మార్చి 6నుంచి 15వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు విద్యార్థులను మరింత సన్నద్ధం చేయడానికి జిల్లాలో ఈ నెల 17నుంచి సిలబస్ గ్రాండ్ టెస్టులు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

గ్రాండ్‌టెస్ట్ ఇలా..

మార్చి 2025 పబ్లిక్ పరీక్షలకు ముందే ప్రాక్టిస్ పేపర్ల ద్వారా పదో తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో మరింత సాధన చేయించడానికి గ్రాండ్ టెస్ట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 246 పాఠశాలలకు చెందిన 9,489మంది విద్యార్థులు గ్రాండ్‌టెస్ట్‌లో పాల్గొననున్నారు. పరీక్షల షెడ్యూల్‌ను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. ఈ నెల 17న మొదటి భాష(తెలుగు, హిందీ), 18న ద్వితీయ భాష(హిందీ, ఉర్దూ), 19న ఇంగ్లిష్, 20న గణితం, 21న ఫిజికల్ సైన్స్, 22న బయోలాజికల్ సైన్స్, 24న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గ్రాండ్‌టెస్ట్ నిర్వహించనిపక్షంలో చర్యలు తీసుకోనున్నారు. ఫిబ్రవరిలో సమ్మేటివ్-1, గ్రాండ్‌టెస్ట్ ఫలితాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ఈ సబ్జెక్టులపై దృష్టి సారించాలి

గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 20వ స్థానంలో నిలిచింది. విద్యార్థుల్లో గణితం, ఆంగ్లం అంటే భయం ఉంటుంది. తెలుగు భాషలో తప్పిన విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువే. ప్రతియేటా లెక్కల్లో తికమకపడే విద్యార్థులతోపాటు మాతృభాషలో పది పరీక్షల్లో తప్పుతున్న వారి సంఖ్య కలవరపరుస్తోంది. 2022-23లో 10,071మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,552మంది ఉత్తీర్ణులయ్యారు. 1,519మంది ఫెయిలయ్యారు. పరీక్ష తప్పిన వారిలో ఒక్క గణితంలోనే 1,162మంది విద్యార్థులు ఉండడం గమనార్హం. 2023-24లో 9,283 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,579 మంది ఉత్తీర్ణులు కాగా 704 మంది అనుత్తీర్ణులయ్యారు. ఇందులో అత్యధికంగా తెలుగు సబ్జెక్టుల్లో 312 మంది ఫెయిలు కాగా తర్వాత స్థానంలో 227 మంది లెక్కల్లో తప్పిన వారే కావడం ఆందోళన కలిగిస్తోంది. అన్ని సబ్జెక్టులతోపాటు గణితం, తెలుగు భాషలో వెనుకబడిన వారిపై దృష్టి సారించి పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. లెక్కలు, తెలుగులో విద్యార్థుల సందేహాలు టీచర్లు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలి.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్
- పాఠశాలల సందర్శన



నెల్కి వెంకటాపూర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు సమీపిస్తున్నాయని, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్, నెల్కి వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మోడల్ స్కూల్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇంకా ప్రారంభానికి నోచుకోని హాస్టల్ భవనంపై అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ బాలికల సంఖ్య ఎంత ఉందని, ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఆర్ఐ భూమన్న పాల్గొన్నారు.

అర్హులైన బాధితులకు పరిహారం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన బాధితులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బాధితుల వివరాలను ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులు సంబంధిత పత్రాలతో సంప్రదించాలని తెలిపారు.

తాండూర్ అడవుల్లోకి పులి



పులికుంట సమీపంలో అటవీ సిబ్బంది గుర్తించిన పాదముద్రలు

తాండూర్: బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధి కన్నాల అడవుల్లో దాదాపు 12రోజులపాటు సంచరించిన పులి ఆదివారం అర్ధరాత్రి ఎట్టకేలకు తాండూర్ మండలంలోని అడవుల్లోకి ప్రవేశించింది. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల మధ్యలో ఉన్న బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అంకుశం గ్రామ శివారులో ఉన్న గుట్ట పక్క నుంచి మాదారం శివారు గొంతెమ్మ గుట్ట వైపు మళ్లింది. అక్కడ పాదముద్రలను అటవీ అధికారులు గుర్తించి ధ్రువీకరించారు. సోమవారం తెల్లవారుజామున పులి మరో ప్రాంతానికి వెళ్లింది. తాండూర్ మండలం పెగడపల్లి, రేపల్లేవాడ, తక్కళ్లపల్లి గ్రామాల పక్క నుంచి కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పులికుంట గ్రామ శివారు ప్రాంతంలో సంచారం చేస్తున్నట్లు అటవీ అధికారులు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. పులి పాదముద్రలను ఎనిమల్ ట్రాకింగ్ అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు కదులుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని శివారు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇళ్లలో నుంచి రాత్రివేళ బయటకు రావొద్దని, అటవీ ప్రాంతంలో సంచరించొద్దని సూచిస్తున్నారు. ఎక్కడైన పులి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ శిబిరాలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఉచిత పంపిణీకి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలింకో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జైపూర్, నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్ మండలాల వారికి ఈ నెల 17న మంచిర్యాలలోని మైనారిటీ ఫంక్షన్‌హాల్‌లో, చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాల వారికి ఈ నెల 18న చెన్నూరులోని మైనారిటీ ఫంక్షన్‌హాల్, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, మందమర్రి రూరల్/అర్బన్ ప్రాంతాల వారికి ఈ నెల 19న బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల, రైతువేదిక వద్ద, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల వారికి ఈ నెల 20న లక్షెట్టిపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్‌చైర్, చంకకర్రలు, చేతికర్రలు, బధిరులకు(మూగ, చెవిటి) శ్రవణ యంత్రాలు, అంధులకు ప్రత్యేక మొబైల్ ఫోన్లు, చేతికర్రలు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కిట్లు అందిస్తామని పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యే వారికి సదరం ధ్రువపత్రం, యూడీఐడీ కార్డు ఉండాలని, లేనివారు https://www.swavlam ban card. gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 6300556075, 8688531109 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు పచ్చజెండా

- నేటి నుంచి యధాతథంగా నడపనున్న రైల్వే శాఖ
- రైల్వే ఫోరం సభ్యుల ట్వీట్‌లకు స్పందించిన రైల్వే అధికారులు
- రద్దు నిర్ణయం ఉపసంహరణ



బెల్లంపల్లి: సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య రోజువారీగా రాకపోకలు సాగించే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు(నంబరు 17233, 17234)ను యధాతథంగా నడపడానికి రైల్వే అధికారులు ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 10 నుంచి 20వరకు 11రోజులపాటు రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తర తెలంగాణకు చెందిన రైల్వేఫోరం సభ్యులు, ప్రయాణికులు ఎక్స్ వేదికగా పెద్దయెత్తున రైల్వేశాఖకు ట్వీట్ చేయడంతోపాటు ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ సంప్రదింపులు జరిపారు. అనివార్య పరిస్థితుల్లో రైల్వే అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. మంగళవారం నుంచి పట్టాలపై పరుగులు తీసేలా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేస్తూ పచ్చజెండా ఊపారు.

రైల్వే అధికారుల తీరుపై వెల్లువెత్తిన విమర్శలు

దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధి ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా రైల్వే అధికారులు రైళ్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 30 రైళ్లను వివిధ తేదీల్లో రద్దు చేసి కొన్ని రైళ్లను దారి మళ్లించి నడపాలని నిశ్చయించారు. మరి కొన్ని రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతాయని ప్రకటించారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌లో చేపట్టనున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనులతో సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ మార్గంలో నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు ఏమాత్రం సంబంధం లేకపోయినా గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుతో ముడిపెట్టి తప్పుడు నిర్ణయం తీసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ తీరును నిరసిస్తూ ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యులు, మంచిర్యాల, పెద్దపల్లి, జమ్మికుంట, రామగుండం, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి రైల్వే ప్రయాణికులు ఎక్స్ వేదికగా రైల్వే ఉన్నతాధికారులపై దుమ్మెత్తి పోశారు. ఖమ్మం వైపు మూడో రైల్వేలైన్ మార్గంలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడితే కాజీపేట-బల్లార్షా మార్గంలో నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేయడం ఏమిటని తప్పుడు నిర్ణయాన్ని ఎత్తి చూపారు. ఈ అంశంపై 'సాక్షి' దినపత్రిక ఈ నెల 8న 'భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు' శీర్షికన ప్రయాణికుల పక్షాన రైల్వే అధికారుల అనాలోచిత నిర్ణయాన్ని ప్రధానంగా ప్రస్తావించి పాఠకులకు కదిలించిన సంగతి తెలిసిందే. అనేకమంది సాక్షి కథనం క్లిప్పింగ్‌ను జోడించి రైల్వే అధికారులకు సామాజిక మాధ్యమాల ద్వారా పంపించారు. రైలు రద్దుతో ఈ మార్గంలో ప్రయాణం సాగించే ప్రయాణికులకు ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని, వెంటనే రైలు రద్దు ఉత్తర్వులను వెనక్కి తీసుకుని యధాతథంగా నడిపించాలని సూచించింది. మొత్తానికి ఎంపీ సంప్రదింపులు, రైల్వే ఫోరం సభ్యులు, ప్రయాణికుల ట్వీట్‌లు, సాక్షి దినపత్రిక కథనం రైల్వే అధికారుల మనసు మార్చుకునేలా చేసి సమస్య పరిష్కారానికి దారి చూపాయి.

ఆధునిక సాంకేతిక శిక్షణకు చర్యలు

- పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్



నిర్మాణాలను పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్

పాతమంచిర్యాల: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లతోపాటు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్, ఐటీఐ కళాశాలను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ శాఖ సీఅండ్ఎండీ వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఉపాధి శిక్షణ సంస్థ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారామయ్య, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఐటీఐలు, ఏటీసీలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఏటీసీ నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూర్ మండలాల తహసీల్దార్లు రఫతుల్లా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్‌గా సూర్యనారాయణ



డైరెక్టర్లను సన్మానిస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణి నూతన డైరెక్టర్‌గా శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ ఎంపికయ్యారు. ఇటీవల కంపెనీలో ఖాళీ ఉన్న రెండు డైరెక్టర్ స్థానాలకు యాజమాన్యం ఇంటర్వ్యూలు నిర్వహించింది. 10మంది జీఎంలను ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. సీనియారిటీ, సామర్థ్యం ఆధారంగా ఇద్దరు జీఎంలకు పదోన్నతులు కల్పించి డైరెక్టర్లుగా కంపెనీ నియమించింది. ఇందులో శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ, అడ్రియాల జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు ఉన్నారు. ఇంటర్వ్యూల ఫలితాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం వీరిని డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్వీ సూర్యనారాయణ డైరెక్టర్(ఆపరేషన్స్)గా, కొప్పుల వెంకటేశ్వర్లు డైరెక్టర్(ప్రాజెక్టు, ప్లానింగ్)గా వ్యవహరిస్తారు. ఏరియా జీఎం డైరెక్టర్‌గా ఎంపిక కావడంపై అధికారులు, యూనియన్ నాయకులు అభినందించారు. నూతనంగా ఎంపికైన ఇద్దరు డైరెక్టర్లను రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ అభినందించారు. హైదరాబాద్‌లోని సింగరేణి సింగరేణి భవన్‌లో వారిద్దరిని సన్మానించారు. డైరెక్టర్లుగా రాణించి కంపెనీని మరింత అభివృద్ధిపర్చాలని ఆకాంక్షించారు.

అటవీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలి



కార్యాలయ ఆవరణలో ఏలుసింగ్, శాంతారాం

వేమనపల్లి: క్షేత్ర స్థాయిలో ఉన్న అటవీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు, పీసీసీఎఫ్ శాంతారాం అన్నారు. సోమవారం మండల పరిధిలోకి వచ్చే ప్రాణహిత వన్యసంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన సోలార్ బోర్ బావులు, నీటికుంటలు, గడ్డి మైదానాలు సందర్శించారు. నీల్వాయి రేంజ్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ హాసీస్ సింగ్, చెన్నూర్ ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి ఎఫ్ఆర్‌ఓలు శివకుమార్, సదానందం, అప్పలకొండ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు సందర్శన

కోటపల్లి: చెన్నూర్ రేంజ్ చింతలపల్లి బీట్ పరిధి పార్‌పల్లి, చెన్నూర్ మండలం కిష్టంపేట సమీపంలో ఏర్పాటు చేసిన అటవీ చెక్‌పోస్టులను సోమవారం వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలు సింగ్ మేరు సందర్శించారు. చెక్‌పోస్టు నిర్వహణ, జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. కవ్వాల్ టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, జిల్లా డీఎఫ్‌వో శివ ఆశిష్ సింగ్, చెన్నూర్ ఫారెస్టు డివిజన్ అధికారి సర్వేశ్వర్, రేంజ్ అధికారులు శివకుమార్, సదానందం, అప్పలకొండ, డీఆర్‌వో లావణ్య పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని ఇంచార్జి డీఈవో లలిత సూచించారు. సోమవారం జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యాశాఖ, ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 18 మండలాల నుంచి విజేతలైన ప్రతీ మండలానికి ముగ్గురు చొప్పున 54 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఎన్.చరణ్(తెలంగాణ మోడల్‌స్కూల్ మంచిర్యాల) ప్రథమస్థానం, అరవింద్ గౌడ్(జెడ్పీహెచ్ఎస్ కిష్టాపూర్) ద్వితీయ స్థానం, అనిల్(జెడ్పీహెచ్ఎస్ కిష్టాపూర్) తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. డీఈవో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. డీఎస్‌వో మధుబాబు, సెక్టోరల్ అధికారి చౌదరి, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు శ్రీమూర్తి, ప్రధాన కార్యదర్శి రాజన్న, కోశాధికారి సదానందం పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు'



మాట్లాడుతున్న మాజీ అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నిరుద్యోగ యువత, ఉపాధ్యాయులను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలవుతున్నా అదే విధంగా మోసం చేస్తోందని విమర్శించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు దుర్గం అశోక్, పత్తి వెంకటకృష్ణ, ఎనగందుల కృష్ణమూర్తి, బియ్యాల సతీశ్‌రావు, జోగుల శ్రీదేవి, మాధవరపు వెంకటరమణరావు, అమిరిశెట్టి రాజ్‌కుమార్, సత్రం రమేశ్, గద్దం స్వామిరెడ్డి, కర్రె లచ్చన్న, బొద్దున మల్లేశ్, గాదె శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పదవ తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పురుషోత్తంనాయక్‌తో కలిసి బీసీ సంక్షేమ వసతిగృహాల సంక్షేమాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధన దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు గల ఆహారం అందించా లని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, ఏవో తిరుమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని ఆచూకీ లభ్యం

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాల నుంచి అదృశ్యమైన 9వ తరగతి విద్యార్థిని ఆచూకీ లభ్యమైంది. ఆదివారం పాఠశాల నుంచి అదృశ్యమైన విషయం తెలిసిందే. స్థానిక ఎస్సై సాయికుమార్ విద్యార్థిని వివరాలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించి సమాచారం ఇచ్చారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించే క్రమంలో భైంసా-నిర్మల్ రహదారిలో ఆచూకీ లభ్యమైందని ఎస్సై తెలిపారు. విద్యార్థినిని నిర్మల్ జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రానికి పంపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



గుడుంబా తయారీదారుడితో పోలీసు

నెన్నెల: మండలంలోని పెద్ద లంబాడితండాలో సోమవారం పోలీసులు దాడులు నిర్వహించి 70 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పెద్ద లంబాడితండా శివారులోని మామిడితోటలో అక్రమంగా నాటుసారా తయారు చేసి రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జజ్జరవెల్లికి చెందిన గుర్దే జగ్గయ్య వద్ద 30 లీటర్లు, పెద్ద లంబాడితండాకు చెందిన దరావత్ రవి వద్ద 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు



ఆగి ఉన్న లారీ, ప్రమాదానికి గురైన కారు

మామడ:మండలంలోని బూరుగుపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని సోమవారం కారు ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కారు(టీఎస్ 16 ఈపీ 3695)లో కుంభమేళాకు బయల్దేరారు. 44వ జాతీయ రహదారిపై ఎలాంటి హెచ్చరికలు, సిగ్నల్స్ లేకుండా, అజాగ్రత్తగా ఆపి ఉన్న లారీ(ఎంహెచ్ 09 హెచ్‌హెచ్ 9109)ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు బొంతుల పోశెట్టి, బొంతుల సావిత్రి, ఈశ్వర్ ప్రసాద్, గుడిసె ప్రభాకర్ గాయపడ్డారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఎనిమిది మందిపై కేసు

భీమారం: చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆయన పీఏ రమణారావులనుకించపరుస్తూ వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు చింతం సృజన్ ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, కార్యకర్తలు దాసరి మధునయ్య, దాసరి మణిదీప్, బబ్లు, వడ్లకొండ పవన్, డోంగిరి రాజలింగు, రమేశ్, గుడిమల్ల నరహరి, ఆకుదారిరాజంతోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆఖిరి రోజు అట్టహాసంగా..

- ముగిసిన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ నామినేషన్లు
- ఒకేరోజు నామినేషన్ వేసిన 59 మంది అభ్యర్థులు
- రెండుస్థానాలకు కలిపి మొత్తం 117 దాఖలు
- ప్రధాన పోటీదారులంతా మిలియనీర్లే
- రూ.120 కోట్లతో ముందంజలో అంజిరెడ్డి
- జనసంద్రమైన కరీంనగర్ వీధులు



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి







నామినేషన్ వేయడానికి ర్యాలీగా వస్తున్న యాదగిరి శేఖర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, మల్క కొమురయ్య

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ ప్రక్రియ ముగిసింది. సోమవారం ఆఖరురోజు కావడంతో భారీగా అభ్యర్థులు పోటెత్తారు. అనుచరులు, కార్యకర్తలు వెంటగా వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం చివరిరోజు కావడంతో 59 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 51 గ్రాడ్యుయేట్స్ కోసం రాగా.. మిగిలిన 8 టీచర్స్ స్థానానికి వచ్చినట్లు వివరించారు. మూడో తేదీన మొదలై నామినేషన్లలో ఇప్పటి వరకూ గ్రాడ్యుయేట్స్‌కు 100, టీచర్స్ ఎమ్మెల్సీకి 17 నామినేషన్లు వేసినట్లు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరీంనగర్ నగర వీధులన్నీ ర్యాలీలతో నిండిపోయాయి. కాంగ్రెస్ తరఫున పలువురు మంత్రులు హాజరు కాగా.. ఆఖరి రోజు కావడంతో ప్రధాన అభ్యర్థులంతా ర్యాలీల కోసం భారీగా జనసమీకరణ చేయడంతో నగర వీధులన్నీ జనసంద్రంగా మారాయి. కళాకారుల ఆటపాటలు, డప్పువాయిద్యాలతో హోరెత్తిపోయాయి.

- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి రెండోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, విప్‌లు ఆదిశ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, చింతకుంట విజయరమణరావు, మక్కాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.
- బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా శేఖర్‌రావులు భారీగా అనుచరులు తరలిరాగా స్వతంత్రులుగా నామినేషన్ వేశారు. రవీందర్‌సింగ్ కేసీఆర్ చిత్రపటంతో వెళ్లి నామినేషన్ వేయడం గమనార్హం. వీరిద్దరూ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే అయినా.. ఈసారి స్వతంత్రులుగా బరిలోకి దిగడం విశేషం.
- ఎస్టీయూ, టీపీఆర్టీయూ బలపరిచిన సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి టీచర్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేశారు. హర్షవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, షాబీర్, తిరుపతి ఉన్నారు.
- టీఎస్‌యూటీఎఫ్, ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరిచిన కరీంనగర్ నియోజకవర్గ టీపీటీఎఫ్ టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ నామినేషన్ వేశారు. నల్గొండ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బరిలో మిలియనీర్లే.. చిన్నమైల్ అంజిరెడ్డి
వ్యక్తిగత ఆస్తులు: రూ.120,40,41,274
భార్య ఆస్తులు : రూ.54,79,63023
మొత్తం రూ.175 కోట్లపై చిలుకు
బంగారం వ్యక్తిగతం: 250 గ్రాములు
(విలువ రూ.19.32 లక్షలు)
భార్య పేరిట 1,850 గ్రాములు
(విలువ రూ.1.43 కోట్లు)

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి
వ్యక్తిగత ఆస్తులు: రూ.30,00,59,840
భార్య పేరిట: రూ.13,38,36,263
(ఆయనభార్యకు క్రిస్టా కారు,అరకిలో బంగారం)
ఉమ్మడి ఆస్తులు రూ. రెండు కోట్లు
మొత్తం రూ.45.50 కోట్లు

మల్క కొమురయ్య
వ్యక్తిగత ఆస్తులు: రూ.32,08,62,420,
ఆయన భార్యకు: రూ.29,55,03,158
మొత్తం కలిపి: రూ.61,63,65,578
భార్య వద్ద 4,457 గ్రాముల బంగారం
(విలువ.రూ.17,93 కోట్లు)

వంగ మహేందర్ రెడ్డి
స్థిరచరాస్తులు రూ.1,19,14,753,
స్థిరాస్తులు రూ.8,56,90,056
మొత్తం రూ.20,48,04,809

ప్రసన్న హరికృష్ణ
వ్యక్తిగత ఆస్తులు: రూ.49.07 లక్షలు
భార్య పేరిట భార్య: రూ.2.16 కోట్లు
మొత్తం రూ.2.65 కోట్లు
భార్యవద్ద 300 గ్రాముల బంగారం

సర్దార్ రవీందర్ సింగ్
ఆయన చరాస్తులు రూ.1,10,09,802,
స్థిరాస్తులు రూ. 73,81,000
మొత్తం: 1.83 కోట్లు

తిర్పెల్లిలో రైస్ మిల్‌పై దాడులు

- 3011.261 మెట్రిల్ టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తింపు
- ధాన్యం విలువ రూ.6.93 కోట్లు ఉంటుందని అంచనా
- వివరాలు వెల్లడించిన డీఎస్‌వో



వివరాలు సేకరిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లిలోని రెండు రైస్ మిల్లులపై సివిల్ సప్లయ్ అధికారులు దాడి చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటలకు వచ్చిన సమాచారం మేరకు తిర్పెల్లిలోని రైస్ మిల్లుల్లో పౌరసరఫరాల శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. రెండు లారీల్లో ధాన్యం లోడ్ చేసి ఉండడంతో వివరాలు కోరారు. వివరాలు సరిగా చెప్పకపోవడంతో సీజ్ చేశారు. సోమవారం ఉదయం మళ్లీ నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా, డీఎస్‌వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ జానకీ ఆధ్వర్యంలో రెండు మిల్లులను తనిఖీ చేశారు. ప్రతిమ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో 1789.181 మెట్రిక్ టన్నులు ధాన్యం తక్కువ వచ్చిందని, శ్రీనిర్వాణ రైస్ మిల్లులో 1222.080 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. రెండు రైస్ మిల్లులు కలిపి 3011.261 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువ వచ్చిందని తెలిపారు. విలువ రూ.6.93 కోట్లు ఉంటుందని ఆయన తెలిపారు. రెండు లారీల ధాన్యం సమీపంలోని ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. తహసీల్దార్ జానకి, ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ కార్తీక్‌రెడ్డి, సోన్ సీఐ నవీన్ కుమార్, ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై సుమలత, ఆర్‌ఐ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్వేషణ పోటీల్లో మెరిసిన ఆర్జీయూకేటీ విద్యార్థులు

- అభినందించిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



చెక్కు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిష్టాత్మక అన్వేషణ పోటీల్లో ఆర్జీయూకేటీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 'సోలార్ ఎడ్యు వీల్స్' అనే ప్రాజెక్ట్ ప్రదర్శించి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జావేద్ నేతృత్వంలో వారి బృందం సోలార్ ఎడ్యు వీల్స్ అనే అంశంపై ప్రాజెక్టును రూపొందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ అభినందించారు. మారుమూల ప్రాంతాల్లో విద్యను విప్లవాత్మకంగా మార్చాలని లక్ష్యంగా సౌరశక్తితో నడిచే మొబైల్ తరగతి గది మారుమూల గ్రామాలకు వెళ్లడానికి, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. ఈ వినూత్న ప్రాజెక్ట్ ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన మొత్తం 17 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్డీజీ)తో సమలేఖనం చేస్తుందన్నారు. ఇది సమగ్రమైన, సమానమైన విద్యవైపు ఒక శక్తివంతమైన అడుగని పేర్కొన్నారు. టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ ముధోల్‌కు చెందిన గంగా ప్రసాద్(10వ తరగతి). సూరజ్ (9వ తరగతి)లతో కూడిన బృందం వారి అత్యుత్తమ కృషికి గుర్తింపుగా రూ.5 వేల చెక్కుతోపాటు ప్రశంసాపురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఏవో రణధీర్‌సాగి, కన్వీనర్ డాక్టర్ రాకేశ్‌రెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భీంనగర్‌లో రూ.8లక్షలు చోరీ

- కూతురు పెళ్లి కోసం దాచిన డబ్బును ఎత్తుకెళ్లిన దుండగులు



డబ్బులు భద్రపరిచిన ఇనుప బాక్స్ ఇదే

ఇంద్రవెల్లి: గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.8లక్షల నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక భీంనగర్‌కు చెందిన సూర వెంకటి తనకున్న ట్రాక్టర్ ద్వారా వివిధ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూతురు పెళ్లి కోసం ప్రతి నెలా కొంత డబ్బు పొదుపు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం అందిన కిరాయి, ఇతర డబ్బులు రూ.10 వేలను ఇంట్లో ఉన్న ఇనుప బాక్స్‌లో భద్రపరిచాడు. ఆదివారం సాయంత్రం ఇంటి అవసరాల నిమిత్తం బాక్స్‌ను తెరిచి చూడగా అందులో దాచిన రూ.8 లక్షలు కనిపించకపోవడంతో ఖంగుతిన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం బాధితుడి ఇంటిని సందర్శించడంతో పాటు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. కూతురి పెళ్లి కోసం పొదుపు చేసిన డబ్బులను దొంగలు ఎత్తుకెళ్లడంతో ఆ కుటుంబం లబోదిబోమంటోంది. పోలీసులు దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్



నిందితుడితో ఎస్సై మధుకర్

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం పార్డి గ్రామంలో చోరీకి పాల్పడిన డి.నాగేంద్రను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. కౌటాల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. పార్డి గ్రామానికి చెందిన చాప్లే శ్యాంరావ్ ఈ నెల 7న ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి చేరగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో భద్రపరిచిన రెండు తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. ఈ నెల 8న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి అదే గ్రామానికి చెందిన నాగేంద్ర చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడి వద్ద సొమ్ము రికవరీ చేసి శ్యాంరావ్‌కు అప్పగించారు. చోరీకి పాల్పడిన నాగేంద్రపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

కారు ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మహ్మద్ షమీ కారును ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదే కాలనీకి చెందిన సయ్యద్ జుబేర్, సయ్యద్ అక్తర్, ఫైజల్ ఈ నెల7న కాలనీలోని షమీ ఇంటి ముందు నిలిపి ఉంచిన కారును ధ్వంసం చేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు సయ్యద్ జుబేర్‌ను అరెస్ట్ చేశారు. జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా కండిషన్ బెయిల్ మంజూరు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేలా సదరు నిందితుడు పది రోజుల పాటు పట్టణంలో కనిపించకుండా బయటకు వెళ్లిపోవాలని జడ్జి సూచించినట్లుగా పేర్కొన్నారు. అలాగే సదరు వ్యక్తిపై టు టౌన్‌లో రౌడీషీట్ సైతం తెరిచినట్లుగా తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు.

అలరించిన కుస్తీపోటీలు



కుస్తీపడుతున్న బాలిక దేవికా

కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం రంజని గ్రామంలో నిర్వహిస్తున్న మహాలక్ష్మి జాతరలో భాగంగా సోమవారం కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాల వస్తాదులు(మల్లయోధులు), మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన వస్తాదులు పాల్గొన్నారు. మహారాష్ట్రలోని యవత్‌మాల్ గ్రామానికి చెందిన దేవిక అనే బాలిక బాలుడితో తలపడి విజయం సాధించింది. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.5 వేలు మహారాష్ట్రకు చెందిన నీలేష్ గెలవగా, రెండో బహుమతి రూ.3 వేలు దార్‌కుభీర్‌కు చెందిన నాగేశ్ గెలుచుకున్నాడు.

ముచ్చటగా మూడోసారి



పాత తోయగూడ గ్రామస్తులు, కుటుంబసభ్యులు

- పాత తోయగూడవాసుల అ 'పూర్వ' సమ్మేళనం

బేల: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 39 ఏళ్ల క్రితం విడిపోయిన ఆ గ్రామస్తులంతా కుటుంబ సభ్యులతో తిరిగి కలుసుకోవడం వారికి ఆనవాయితీగా మారింది. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత 2023 ఫిబ్రవరి 10న తొలిసారి కలిశారు. గతేడాది అదే తారీఖున రెండో సారి, ఈ సారి ముచ్చటగా మూడోసారి ఆ పాత గ్రామంలో కలిసి నాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ప్రస్తుత సాత్నాల మండలం పాత తోయగూడ గ్రామం ఇందుకు వేదికైంది.

నాడు ప్రాజెక్టు ముంపునకు గురైన గ్రామం..

1984 సంవత్సరంలో అప్పటి జైనథ్ మండలంలో సాత్నాల ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైన పాత తోయగూడ గ్రామ ప్రజలంతా చెల్లాచెదురై, బతుకుదెరువు కోసం వేరువేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. కాలం గడుస్తున్న క్రమంలో రెండేళ్లుగా ఏటా అదే ప్రాంతంలో కలుస్తున్నారు. 41 ఏళ్లు పూర్తయ్యే క్రమంలో మరోసారి సోమవారం కలుసుకున్నారు. నాటి యువత.. ప్రస్తుతం వృద్ధాప్య అంచునకు చేరారు. అయినా ఆ ప్రేమానురాగాలు, నాటి స్మృతులను వారు ఇంకా మరువలేదు. అనుకున్న ప్రకారం కుటుంబసభ్యులతో కలిసి ఉదయాన్నే అక్కడికి చేరుకున్నారు. ఆడి పాడి రోజంతా ఆనందంగా గడిపారు. నాటి ఆలయాలు, దాహం తీర్చిన బావి, ఇలా పూర్వ జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఇందులో గద్దల శంకర్, అడప తిరుపతి, బడాల ప్రతాప్‌రెడ్డి, ఆవుల మహేందర్, వెంకట్‌రెడ్డి, కంతం వేణుగోపాల్, కుర్సంగే నీలకంఠ, బోనగిరి సంటెన్న, రాజు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వస్తే కాళ్లుపోయాయి..!

- బస్సు కింద పడి దివ్యాంగుడికి గాయాలు
- మంచిర్యాల బస్టాండ్‌లో ఘటన



బస్సు కింద పడి గాయపడిన లక్ష్మణ్

మంచిర్యాలక్రైం: ఆయన దివ్యాంగుడు(చెవిటి, మూగ).. పింఛన్ కోసం కలెక్టర్‌కు మొర పెట్టుకుందామని వచ్చాడు. కలెక్టర్‌ను కలిసి ఇంటికి వెళ్తుండగా.. మరో ప్రమాదం బారిన పడి కాళ్లు కోల్పోయాడు. ఈ సంఘటన సోమవారం మంచిర్యాల బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటపల్లి మండలం జనగామకు చెందిన దివ్యాంగుడు(చెవిటి, మూగ) చెన్నూరి లక్ష్మణ్ పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చాడు. కలెక్టర్‌ను కలిసి ఇంటికి వెళ్లేందుకు మంచిర్యాల బస్టాండ్‌కు చేరాడు. చెన్నూర్ బస్సు ఎక్కేందుకు వెళ్లిన లక్ష్మణ్‌కు ఆ బస్సు శబ్దం వినిపించలేదు. బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. దీంతో లక్ష్మణ్ రెండు కాళ్లపై నుంచి బస్సు వెళ్లడంతో విరిగిపోయాయి. స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్సై తెలిపారు.

గాలి అందక ఉద్యోగికి అస్వస్థత



ఉద్యోగిని పరామర్శిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో సోమవారం మొదటి షిఫ్టులో ఫిట్టర్ జనార్దన్ పని స్థలంలో గాలి(ఆక్సిజన్) అందక అస్వస్థతకు గురయ్యాడని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య ఆరోపించారు. రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనార్దన్‌ను ఆ యూనియన్ నాయకులతో కలిసి పరామర్శించారు. సమ్మయ్య మాట్లాడుతూ పాత గులాయిల వద్ద పంపు తొలగించే పనులకు ఎలాంటి పర్యవేక్షణ లేకుండా పంపించడం వల్లనే అస్వస్థతకు గురయ్యాడని వివరించారు. తోటి వర్కర్‌లు గని పైకి తీసుకువచ్చి రామకష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని, ఉద్యోగికి మెరుగైన చికిత్స అందించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నాగేందర్ (ఫైల్)

భైంసాటౌన్:పట్టణ శివారులోని నాగదేవుడి ఆలయ స మీపంలో జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, బంధువు ల కథనం ప్రకారం.. కుభీర్ మండలం లింగి గ్రామానికి చెందిన కాసర్కర్ నాగేందర్(36) సోమవారం సాయంత్రం భైంసా నుంచి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేందర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఫోన్ రిపేర్ చేయించలేదని మహిళ ఆత్మహత్యాయత్నం



సురేఖను కాపాడుతున్న శ్రీకాంత్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు

లోకేశ్వరం: మొబైల్ ఫోన్ రిపేర్ చేయించలేదని మహిళా ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన లోకేశ్వరంలో సోమవారం జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌తండాకు చెందిన మూడు సురేఖ ఫోన్ పాడైంది. బాగు చేయించేందుకు రూ.1500 ఇవ్వాలని తన భర్త మౌలాను కోరింది. భర్త డబ్బులు ఇవ్వలేదు. దీంతో మండల కేంద్రంలోని భగీరథ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. చెరువు వద్ద పొలం పని చేయడానికి వచ్చిన శ్రీకాంత్ గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, సబ్దార్ హుస్సేన్ ఘటన స్థలానికి చేరుకుని సురేఖను కాపాడారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కౌన్సెలింగ్ చేసి భర్తకు అప్పగించారు.

బాసర ఆసుపత్రిలో కాలం చెల్లిన సిరప్



కాలం చెల్లిన మందులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాలం చెల్లిన మందులు ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈనెలాఖరుకు గడువు ముగిసే పారాసిటమాల్ సిరప్ బాటిల్‌ను స్థానికుడు సోమవారం గుర్తించాడు. ఈ విషయమై డాక్టర్‌ను నిలదీశాడు. డాక్టర్ 'మా దగ్గర అదే ఉంది' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. చివరకు సిరప్ మార్చాడు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం రోగులకు ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.